25న దేశభక్తి పాటలు, నాట్య సంబరాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 25వ తేదీన దేశ భక్తి పాటలు, నాట్య సంబరాలు నిర్వహించనున్నారు. స్ఫూర్తి మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ డైరెక్టర్ సూర్యతేజ, సుబ్రాంత్ మాస్టర్ మాట్లాడుతూ.. ప్రతి భారతీయుడిలో దేశభక్తిని పెంపొందించాలనే లక్ష్యంతో ఈ సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశభక్తి గీతాలు, నృత్యాలు, దేశనాయకుల వేషధారణ, సాహిత్యం, సంగీతం, పేరిని నృత్యం, మిమిక్రీ, మ్యూజిక్, కరాటే, ఏకపాత్రాభినయం తదితర విభాగాల్లో పాల్గొనవచ్చని అన్నారు. ఈనెల 24వ తేదీలోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం.96523 47207.

చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: నగరంలోని ప్రతిష్టాత్మకమైన చిక్కడపల్లిలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం హుండీ కానుకలను గురువారం లెక్కించారు. గతేడాది అక్టోబర్ 17 నుంచి ఈనెల 23 వరకు 98 రోజుల్లో 30లక్షల 13వేల 405 రూపాయలు వచ్చాయని అన్నారు. అందులో 28లక్షల 81వేల 499 రూపాయలు కరెన్సీ, ఒక లక్ష 31వేయి 956 రూపాయల కాయిన్స్ రూపంలో వచ్చాయని ఆలయ ఈవో ఎస్.అన్నపూర్ణ వ్యవస్థాపక వంశీయులు జి.శ్రీనాథ్‌గౌడ్ తెలిపారు. ఇందులో విదేశీ కరెన్సీ సైతం లభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బి.సురేఖ తదితరులు పాల్గొన్నారు.

ఐహెచ్ఆర్ఓ రాష్ట్ర అధ్యక్షుడిగా మహ్మద్ అఫ్జల్



కాచిగూడ: ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ (ఐహెచ్ఆర్ఓ) రాష్ట్ర అధ్యక్షుడిగా మహ్మద్ అఫ్జల్‌ను నియమితులైనట్లు సంస్థ వరల్డ్ చైర్మన్ డా. నేమ్‌సింగ్ ప్రేమి తెలిపారు. మహ్మద్ అఫ్జల్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన నేమ్‌సింగ్ ప్రేమికి కృతజ్ఞతలు తెలియజేశారు. నీతి, నిజాయతీతో తనకు అప్పగించిన బాధ్యతలను నిర్వర్తిస్తానని తెలిపారు.

బీసీ ఉద్యమ బలోపేతానికి మేధావులు ముందుకు రావాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: బీసీ ఉద్యమ బలోపేతానికి మేధావులు, ఉద్యోగులు ముందుకు రావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. గురువారం కాచిగూడ అభినందన్ గ్రాండ్‌లో చెరుకు మణికంఠ అధ్యక్షతన జరిగిన సంఘం రాష్ట్ర స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అవినీతికి వ్యతిరేకంగా యువత ఉద్యమించాలన్నారు. యువతకు రాజకీయాల పట్ల అవగాహన కల్పించేందుకు కళాశాల స్థాయిలో ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శిగా చెరుకు మణికంఠను నియమిస్తూ ఆయన నియామకపు పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ట్రేడర్స్ అసోసియేషన్ సంక్షేమానికి కృషి చేస్తా

కవాడిగూడ: ముషీరాబాద్ వ్యాపారస్తులు ఎదుర్కొంటున్న న్యాయపరమైన సమస్యల పరిష్కారంతో పాటు వారి సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే ముఠాగోపాల్ హామీ ఇచ్చారు. గురువారం కవాడిగూడ, ముషీరాబాద్ ట్రేడర్స్ అసోసియేషన్ కేలండర్‌ను ఆయన ఆవిష్కరించారు.

నగర కేంద్ర గ్రంథాలయంలో నేతాజీ జయంతి వేడుకలో సంస్థ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, కార్యదర్శి పద్మజ, ఉద్యోగులు



వివేకనగర్ బస్తీలో నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేత వినయ్‌కుమార్



మీరు రక్తం ఇవ్వండి..


సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వెంకటస్వామిగౌడ్ తదితరులు


భోలక్‌పూర్‌లో నివాళులర్పిస్తున్న హిందూ వాహిని నాయకులు

అసలు సిసలైన దేశభక్తుడు నేతాజీ..

మీకు స్వాతంత్ర్యం ఇస్తాను!



ఘనంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు

స్వాతంత్ర్య సమర పోరాట యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు గురువారం ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో ఘనంగా జరిగాయి.

ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాటం అనేది అహింసా మార్గంలోనే కాదు... వీర మార్గంలోనూ పోరాడవచ్చని ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి బ్రిటిషర్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తించారని అన్నారు. ''మీరు నాకు రక్తం ఇవ్వండి.. నేను మీకు స్వాతంత్ర్యం ఇస్తాను''ఆయన ఇచ్చిన నినాదం భారతీయుల్లో దేశభక్తిని రగిలించిందన్నారు. ఈ నినాదం ఆజాద్ హింద్ ఫౌజ్‌లో లక్షల్లో యువత చేరేలా ప్రేరేపించిందని అన్నారు. ఇది ఇలాగే కొనసాగితే అఖండ భారతదేశంపై పట్టు సడలిపోతుందని బ్రిటిషర్లు ఎన్నో కుట్రలు పన్నారని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావటంలో ఆయన కీలకపాత్ర వహించారన్నారు. భారత ప్రభుత్వం నేతాజీ జయంతిని పరాక్రమ్ దివస్‌గా నిర్వహిస్తోందని తెలిపారు. విశ్వగురు రవీంద్రనాథ్ ఠాగూర్ నేతాజీని దేశ్ నాయక్ అనే బిరుదును అందించారని అన్నారు. నేటి యువత సుభాష్‌చంద్రబోస్ అడుగుజాడల్లో నడవాలన్నారు.

– ముషీరాబాద్/అంబర్‌పేట జోన్ బృందం

పిల్లల్లో దేశభక్తిని పెంపొందించాలి


వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న వీరయ్య, శ్రీవల్లి తదితరులు

ముషీరాబాద్: పిల్లల్లో దేశభక్తిని, సమాజంపై అవగాహన పెంపొందించాలని హైదరాబాద్ జిందాబాద్ ప్రధాన కార్యదర్శి వీరయ్య అన్నారు. గురువారం ముషీరాబాద్‌లో గణతంత్ర దినోత్సవ వజ్రోత్సవాలను పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వీరయ్య మాట్లాడుతూ... తమ కమిటీ ఆధ్వర్యంలో నగర వ్యాప్తంగా వంద పాఠశాలల్లో దేశభక్తిపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు ఫిబ్రవరి 2వ తేదీన రవీంద్రభారతిలో సర్టిఫికెట్లు, బహుమతులను ప్రదానం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీవల్లీ, యాదగిరి, సాంబశివరావు, రజిని, అరుణ్, లక్ష్మణ్, వెంకటేష్, చారి, రాజమౌళి, రఘు, భారతి, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడికి గురికాకుండా చదువుకోవాలి


ముసీరాబాద్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న వైద్యాధికారి డా. మనోజ్‌రెడ్డి

ముషీరాబాద్: పదో తరగతి పరీక్షలు సమీపిస్తోందని విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా ప్రణాళికాబద్ధంగా చదువుకుంటే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని భోలక్‌పూర్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. మనోజ్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. గురువారం భోలక్‌పూర్ యూపీహెచ్‌సీ పరిధిలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డా. మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ.. పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు బాగా చదువుకోవాలనే లక్ష్యంతో రాత్రి సమయాల్లో ఎక్కువగా మెలకువగా ఉండటం వల్ల ఆరోగ్యం పాడవుతుందన్నారు. ఒత్తిడిని అధిగమించేందుకు ప్రతి రోజు అరగంట పాటు వ్యాయామం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్, భోలక్‌పూర్ యూపీహెచ్‌సీ పీహెచ్ఎన్ కమలమ్మ, ఏఎన్ఎంలు అనూష, సంతోషిణి, ఎంపీహెచ్ఏ యాదగిరి, రాజు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ రాజుకున్న ఆధిపత్య పోరు

- హెబ్రోన్ చర్చి వద్ద ఉద్రిక్త వాతావరణం
- సొసైటీ, ట్రస్ట్ సభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు


చర్చి గేట్‌కు లోపలి నుంచి తాళం వేసుకున్న దృశ్యం

చిక్కడపల్లి: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హెబ్రోన్ చర్చిలో ఆధిపత్య పోరు మళ్లీ రాజుకుంది. గోల్కొండ చౌరస్తాలోని ప్రముఖ హెబ్రోన్ చర్చి వద్ద మరోసారి గురువారం మధ్యాహ్నం సాయంత్రం చర్చిలో పలికి వచ్చి అక్కడి వారిని దౌర్జన్యంగా బయటికి వెళ్లగొట్టి చర్చి గేటుకు తాళం వేశారు. హెబ్రోన్ చర్చికి సంబంధించిన మరో గ్రూపు వారు పెద్ద ఎత్తున చర్చి వద్దకు రావడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో విషయం తెలుసుకున్న ఏసీపీ రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ సిబ్బందితో పాటుతో పాటు చర్చి వద్దకు చేరుకున్నారు. లోపల ఉన్న వీరాచారిని గేటు తాళం తీయాలని పోలీసులు కోరినా అతడు తీయనని మొండికేశారు. ఈ చర్చిలో సొసైటీ, ట్రస్టీ, లోకల్ బాడీ సభ్యులు చర్చించి నిర్ణయం తీసుకుంటారని పోలీసులు తెలిపారు. అనంతరం చిక్కడపల్లి పోలీసులు డీసీపీ అంక్షాన్స్‌యాదవ్, అడిషనల్ డీసీపీ ఆనంద్, ఏసీపీ రామేష్‌కుమార్, సీఐలు రాజునాయక్, రాంబాబు, రాజు, శ్రీనివాస్ రెడ్డిలు ఇరువర్గాలకు సర్ది చెప్పేందుకు చర్చలు జరుపుతున్నారు. ఈ సందర్భంగా క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ యాదవ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, కాంగ్రెస్ నాయకులు గుర్రంశంకర్, అభిషేక్ కెనడీ, మారిశెట్టి నరసింగ్‌రావు చర్చి వద్దకు చేరుకుని సర్ది చెప్పే ప్రయత్నం చేశారు.

నేడు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పర్యటన

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్‌లోని ఇందిరానగర్‌లో ఈనెల 24వ తేదీన ఉదయం 11గంటలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పర్యటించనున్నట్లు బీజేపీ రాష్ట్ర నాయకుడు నందగిరి నర్సింహ, ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ రమేష్‌రాంలు తెలిపారు. గురువారం భోలక్‌పూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఇటీవల సిద్దిపేటలోని కొండపోచమ్మ జలాశయంలో ఈతకు వెళ్లి మృతి చెందిన కుటుంబాన్ని కేంద్రమంత్రి పరామర్శిస్తారని తెలిపారు. అనంతరం భోలక్‌పూర్‌లో పర్యటిస్తారన్నారు.

నేడు ఆర్టీసీ 'డ్రైవర్స్ డే'

కాచిగూడ: రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఈనెల 24వ తేదీన శుక్రవారం 'ఆర్టీసీ డ్రైవర్స్ డే'ను నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ బర్కత్‌పుర డిపో మేనేజర్ ఆర్.మంజులారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం 4గంటలకు బర్కత్‌పుర డిపో నుంచి ప్రారంభమయ్యే మొదటి ట్రిప్పు, సాయంత్రం 5 గంటలకు చివరి ట్రిప్పు డ్రైవర్, కండక్టర్‌లకు అభినందనలు తెలియజేస్తామన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేరవేస్తున్నందుకు ఈ విధంగా అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. డిపోలో మొత్తం 126 సర్వీసులు నడుస్తున్నాయని పేర్కొన్నారు.

అధ్వానపు రోడ్లను ఆధునీకరించాలి


బాపూజీనగర్‌లో బీటీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్‌లోని బాపూజీనగర్, దాయారకమాన్, పఠాన్‌బస్తీ, జామ్‌జామ్ మసీద్ ప్రాంతాలలో రోడ్లను ఆధునీకరించాలని ముషీరాబాద్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం బాపూజీనగర్ తదితర ప్రాంతాలలో జీహెచ్ఎంసీ అధికారులు చేపట్టిన ప్యాచ్‌వర్క్ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. రోడ్ల సమస్యలపై ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు ఫిర్యాదు చేశామని ఆయన వెంటనే స్పందించి ప్యాచ్‌వర్క్ చేయించానన్నారు. రోడ్ల సమస్య శాశ్వత పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, సయ్యద్ సర్వర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలి



ఫిబ్రవరి 7న జరిగే లక్ష డప్పులు వేలాది గొంతుకలకు మద్దతుగా డప్పు కొడుతున్న ప్రొ. కాశీం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: సుప్రీం కోర్టు తీర్పును గౌరవించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను చేపట్టాలని అందులో భాగంగా అసెంబ్లీలో బిల్లును రూపకల్పన చేసి చట్టబద్ధం చేయాలని ప్రొఫెసర్ కాశీం డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాదిగ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న జరిగే ఎస్సీ వర్గీకరణ సదస్సుకు మద్దతుగా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ... లక్ష డప్పులు వేల గొంతుకలకు తమ మద్దతు తెలపాలని ఆయన కోరారు. సుప్రీం కోర్టు ఆగస్టు 1న తీర్పు ఇస్తే 5 నెలలు దాటినా ఇంత వరకు ప్రభుత్వం ఏ చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వర్గీకరణను వెంటనే చేపట్టాలని కోరారు.

◆ మాదిగ మేధావుల ఫోరం అధ్యక్షుడు డా. ఆరెపల్లి రాజేందర్ మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని అయితే వర్గీకరణ అయ్యేంత వరకు ఎలాంటి నోటిఫికేషన్లు విడుదల చేయొద్దని కోరారు. తెలంగాణ లెదర్ ఇండస్ట్రీ ప్రకటించిన రెండు మెగా పార్కులను వెంటనే ప్రారంభించి పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పాటు చేయాలన్నారు. లెదర్ ఇండస్ట్రీ ప్రమోషన్ ఆఫ్ కార్పొరేషన్‌ను పునరుద్ధరించి చైర్మన్, డైరెక్టర్లను నియమించడంతో పాటు రూ.12వేల కోట్లను కేటాయించాలన్నారు. విశ్వ విద్యాలయంలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫోరం ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ నతానియల్, కోశాధికారి బెజ్జంకి రాంబాబు, వశపాక నర్సింహ, పల్లెల వీరస్వామి, జె. నర్సింగరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

కొత్వాల్ యాజ్ క్రికెటర్





రాజ్యసభ మాజీ సభ్యులు వి.హనుమంతరావు, సీఎఫ్ఐ ధ్వర్యంలో గురువారం ఎల్బీ స్టేడియంలో 47వ ఆల్ ఇండియా రాజీవ్‌గాంధీ అండర్–19 టీ–20 లీగ్ క్రికెట్ మ్యాచ్ టోర్నమెంట్ జరిగింది. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో శ్రీలంక వర్సెస్ తమిళనాడు మధ్య జరిగింది. ఈ మ్యాచ్‌కి ముఖ్యఅతిథిగా నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పాల్గొని క్రికెట్ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో సీఎఫ్ఐ వర్కింగ్ ప్రెసిడెంట్ శంభుల శ్రీకాంత్‌గౌడ్, సయ్యద్ సాధిఖ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

– అంబర్‌పేట

బద్రుకలో అంతర్ కళాశాల క్యారమ్స్ టోర్నమెంట్


టోర్నమెంట్‌లో ప్రిన్సిపల్ డా. మోహన్‌కుమార్

కాచిగూడ: ఉస్మానియా యూనివర్సిటీ అంతర్ కళాశాలల క్యారమ్స్ టోర్నమెంట్ 2024–25 పోటీలు గురువారం కాచిగూడలోని బద్రుక కళాశాలలో జరిగాయి. కాచిగూడ బద్రుకా కామర్స్ కళాశాలలో జరిగిన పోటీలకు ఓయూ పరిధిలోని కళాశాలల విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభా పాటవాలను చాటుకున్నారు. పోటీలలో భవన్స్, వివేకానంద డిగ్రీ కళాశాలకు ప్రథమ స్థానం, బద్రుక కామర్స్ కళాశాలకు ద్వితీయస్థానం, ముఫకంజా ఇంజినీరింగ్ కళాశాలకు తృతీయ స్థానం, నీల్‌గోక్టే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి నాల్గోస్థానం దక్కింది. విజేతలైన విద్యార్థులకు ఓయూ కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ ప్రొ. సునీల్ కుమార్ ట్రోఫీలు, పతకాలు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఓయు అంతర్ కళాశాలల టోర్నమెంట్ కార్యదర్శి ప్రొ. రాజేష్‌కుమార్, అంతర్ విశ్వవిద్యాలయాల టోర్నమెంట్ టోర్నమెంట్ కార్యదర్శి ప్రొ. దీప్ల, బద్రుక కళాశాల ప్రిన్సిపల్ డా. మోహన్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ డా. వెంకటయ్య, ఫిజికల్ డైరెక్టర్లు యూసుఫుద్దీన్, గురునామ్‌సింగ్, ఎండీ నసీరుద్దీన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాదలయ



శ్రీరామ గానసభ ఆధ్వర్యంలో న్యూ నల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న సద్గురు శ్రీ త్యాగరాజుస్వామి వార్షిక ఆరాధన సంగీతోత్సవాలు ఆద్యంతం అలరిస్తున్నాయి. గురువారం సాయంత్రం లయమణి, మృదంగ సామ్రాట్ డాక్టర్ డీఎస్ఆర్ మూర్తి బృందం నిర్వహించిన నాదలయ సంగీత అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. అంతకు ముందు సీఎంఆర్ లయప్రియ తనమధురమైన గానంతో ప్రేక్షకులను అలరించారు.

– నల్లకుంట

సినీ సంగీత విభావరి

శ్రీరాగ భైరవి సంస్థ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో గాయనీ గాయకులు గురువారం రాత్రి నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. ఈ సందర్భంగా వంశీ రామరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని గాయనీగాయకులను అభినందించి మాట్లాడారు. ఘంటసాల తర్వాత అంతటి కీర్తిని సంపాదించుకున్న నేపథ్య గాయకుడు బాలు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు దైవజ్ఞశర్మ, కామేష్, చంద్రమౌళి, మనోజ్, భరత్, రాము, ఇందినయన, అనుపమ, అనంది తదితరులు పాల్గొన్నారు.

– చిక్కడపల్లి



అన్నదానం



ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనను అలవర్చుకోవాలని బీఆర్ఎస్ నగర నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం భోలక్‌పూర్ డివిజన్ సంజీవయ్యనగర్‌లోని సాయిబాబా దేవాలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేవాభావంతో పని చేస్తూ పేదలను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, ముప్పిడి నర్సింగ్‌రావు, లోకేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

– ముషీరాబాద్